# బొప్పూడి నక్షత్ర వనంలో మొక్కలు నాటిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్



చిలకలూరిపేటరూరల్, పెన్ పవర్, మార్చి 21:చిలకలూరిపేట: మండలంలోని బొప్పిడి గ్రామంలో పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారానే భావితరాలకు స్వచ్ఛమైన గాలిని అందించగలమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గౌరవ న్యాయమూర్తి బొప్పూడి కృష్ణమోహన్ అన్నారు. శనివారం చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామంలోని నక్షత్ర వనము ను ఆయన తన సతీమణితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా నక్షత్ర వనంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన స్వయంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వగ్రామంపై మమకారంతో పాటు, పర్యావరణం పట్ల గ్రామ ప్రజలు చూపుతున్న శ్రద్ధఅభినందనీయమని కొనియాడారు. నక్షత్ర వనం వంటి ఆధ్యాత్మిక మరియు పర్యావరణ మేళవింపు ఉన్న ప్రాంతాలు మానసిక ప్రశాంతతకు ఎంతోదోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యావరణాన్ని కాపాడు కోవడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం: ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 21: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా భట్టిప్రోలు మండలం వివిధ గ్రామాలకు చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందింది.ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన బాధితుల వైద్య ఖర్చుల బిల్లులను వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు వారి రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ కార్యాలయానికి పంపించగా,పరిశీలన అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కుల రూపంలో సహాయం మంజూరు చేయబడింది. కొనేటిపురం గ్రామంకు చెందిన దీవి కృష్ణమాచార్యులు కు రూ 1,40, 000లు,వెన్నపూస శివ కుమార్ కు రూ 84, 258లు,మురళ సునంద కుమార్ గౌడ్ కు రూ 24, 850లు,భట్టిప్రోలు గ్రామానికి చెందిన యల్లవుల మురళి కృష్ణ కు రూ 89, 117లు పసుపులేటి లక్ష్మీ జయప్రద కు రూ 20, 795లు వెల్లటూరు గ్రామంకు చెందిన పిన్నమనేని రత్నకుమారి కి రూ 30,000లు, కొక్కిలిగడ్డ శిరీష కు 32, 028లు, పెదపులివర్రు గ్రామ నివాసి కొల్లూరు రామకృష్ణ ప్రసాద్ కు రూ 1,52, 189లు,మల్లిపెద్ది వెంకట సుబ్బారావు కు రూ 20,000లు, ఓలేరు గ్రామం కు చెందిననాదెళ్ల రాజని కుమారి కి రూ 80, 236లు, వాకా లక్ష్మీకుమారి కి రూ 20,000లు, పల్లెకోన గ్రామం కు చెందిన బొల్లేద్దు కీర్తన కు రూ 16,000 లు,కంచెర్ల జస్వంతిక కి రూ 21,974లు, ఐలవరం గ్రామంకు చెందిన పంచుమర్తి దీప్తి కి రూ 13, 500లు ఈ సందర్భంగా భట్టిప్రోలు మండలంలోని మొత్తం 14 మందికి రూ 7,44,947లు మంజూరైన మొత్తాన్ని లబ్ధిదారులకు మరియు వారి కుటుంబ సభ్యులకు చెక్కుల రూపంలో మాజీ మంత్రి వేమూరు శాసన సభ్యులు ఆనంద బాబు స్వయంగా అందజేశారు.ఈ



కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గొట్టిపాటి జయ వెంకట పూర్ణ కుమారి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి, తూనుగుంట్ల సాయిబాబా, భట్టిప్రోలు పిఎసిఎస్ చైర్మన్ పరుచూరి రమేష్,రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోటూరు పుణ్య శ్రీనివాసరావు, నూతక్కి దినకర్ బాబు,బీసీ సంఘ నాయకులు రాయన ప్రసాదరావు,మాచర్ల నాగరాజు,అనగాని ఏడుకొండలు,గుర్రం నాగబాబు తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పెద కొదమగుండ్లలో ఘనంగా నారా దేవాన్ష్ జన్మదిన వేడుకలు

పెన్ పవర్ కారంపూడి మర్చి 21 :--- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మనుమడు నారా లోకేష్ తనయుడు నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా పెద కొదమగుండ్ల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం మండల టీడీపీ అధ్యక్షులు గోళ్ళ సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు టీడీపీ నేతలకు పూర్ణకుంభం తో ఘనస్వాగతం పలికారు.పూజల అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పంగులూరి అంజయ్య మాట్లాడుతూ ఆ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో దేవాన్ష్ నిండు నూరేళ ్ళ సుఖసంతోషాలతో జీవించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోల్నెడి శ్రీనివాసరావు,మాజీ మండల అధ్యక్షుడు చప్పిడి రాము,కటికల బాలకృష్ణ,తండా మస్తాన్ జాని,గడిపూడి రామకృష్ణ,కందిమల్ల లక్ష్మయ్య,దోర్నాల బ్రహ్మ రెడ్డి, యరగుని మల్లిఖార్జున ,బోల్నెడి కోటేశ్వరరావు,కొదాటి ప్రభాకర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు



# ఘనంగా రంజాన్ ప్రార్థనలు

తెనాలి రూరల్ (గుంటూరు) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21: పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రంజాన్ ప్రార్థనలు అత్యంత ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక చెంచుపేట ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసి మత పెద్దలతో కలసి సామూహిక ప్రార్థనలు ఆచరించారు. మంత్రి మాట్లాడుతూ నెల రోజులుగా కఠిన ప్రార్థనలు ఆచరించిన రంజాన్ మాసం క్రమశిక్షణ, నిష్ట, దాతఅత్వం, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఉపవాస దీక్షల ద్వారా మనస్సు పవిత్రతో పాటు సమాజంలో పరస్పర గౌరవం, సౌభ్రాతృత్వం పెంపొందుతుందని అన్నారు. మత, వర్గ, వర్ణ, భేదాలను వదిలి పరస్పర ఐక్యతతో కలసిమెలసి ఉ ండాలని ఆకాంక్షించారు. రంజాన్ లాంటి పండుగలు సమాజంలో ఐక్యతను బలపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని, రంజాన్ సందేశం శాంతి, సహనం, సేవాభావం లాంటి గొప్ప విలువలను తెలియజేస్తుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబంలో సంతోషం నింపాలని, అల్లా ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పరంగా ముస్లింలకు తన వంతు సహకారం అందిస్తానని



హామీ ఇచ్చారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు.

# ప్రత్తిపాడులో గాలిదుమ్ము వాన -- ఆందోళనలో మిర్చి, పొగాకు రైతులు

ప్రత్తిపాడు (గుంటూరు) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21: ప్రత్తిపాడు మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లో శనివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తీవ్రమైన గాలిదుమ్ముతో కూడిన భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. ఈ అకాల వర్షం ముఖ్యంగా వాణిజ్య పంటలైన మిర్చి, పొగాకు సాగు చేస్తున్న రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

కళ్లాల్లో తడిసి ముద్దవుతున్న మిర్చి ....

ప్రస్తుతం మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతుండటంతో, రైతులు తమ పంటను కళ్లాల్లో ఆరబోశారు. ఒక్కసారిగా గాలివాన రావడంతో రైతులు కళ్లాల్లో ఉన్న మిర్చిని కాపాడుకోవడానికి పరుగులు తీశారు. వర్షం నుండి రక్షించుకునేందుకు పరదాలు (టార్పాలిన్లు) కప్పుతున్నప్పటికీ, గాలి వేగం ఎక్కువగా ఉండటంతో ఆ కవర్లు సైతం ఎగిరిపోతున్నాయి. దీంతో మిర్చి తడిసి రంగు మారిపోయే ప్రమాదం ఉందని, తద్వారా మార్కెట్‌లో నాణ్యత తగ్గి తక్కువ ధర వచ్చే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొగాకు రైతులకు తప్పని కష్టాలు ....



మరోవైపు, పొగాకు బ్యారన్ల వద్ద, పొలాల్లో ఉన్న పొగాకు కట్టలను కాపాడుకోవడం రైతులకు సవాలుగా మారింది. గాలి తీవ్రతకు పొగాకు ఆకులు చిట్లిపోవడం, కవర్లు ఎగిరిపోవడంతో పంట దెబ్బతినే పరిస్థితి కనిపిస్తోంది. గాలివాన ధాటికి మండలంలోని పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాకు కూడా అంతరాయం కలిగింది.

పెన్ పవర్
సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా . ఎన్.టి.ఆర్. జిల్లా . గుంటూరు జిల్లా . పల్నాడు జిల్లా . బాపట్ల జిల్లా

# ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌కు ఆలయ మర్యాదలతో ఆశీర్వచనం

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 21: చిలకలూరిపేట : పట్టణంలోని బెస్తపాలెంలో వేంచేసియున్న శ్రీ సీతారామ సమేత కావమ్మ తల్లి మారయ్య స్వామి వార్ల దేవస్థానం ఉగాది ఉత్సవాల సందర్భంగా శాసన మండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ని ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఉగాది పర్వదినం నాడు నిర్వహించిన పవిత్ర ఉత్సవాలకు ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వాన కమిటీ సభ్యులు ఆయనను కోరినప్పటికీ, అనివార్య కారణాల వల్ల ఆ రోజు ఆయన అందుబాటులో లేకపోవడంతో వేడుకల్లో పాల్గొనలేకపోయారు.ఈ నేపథ్యంలో, ఆలయ కమిటీ పెద్దలు మర్రి రాజశేఖర్ నివాసానికి వెళ్లి ఆయనను కలుసుకున్నారు. దేవస్థాన ప్రధాన



అర్చకులు జొన్నాదుల రవిబాబు వేద మంత్రోచ్చారణల మధ్య ఆయనకు ఆశీర్వచనాలు అందజేయగా, కమిటీ సభ్యులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను సమర్పించారు.ఈ సందర్భంగా శ్రీ సీతారామ స్వామి వార్ల చిత్రపటంతో పాటు, గత ఏడాది ఉ త్సవాల్లో మర్రి రాజశేఖర్ పాల్గొన్నప్పటి మధుర స్మృతులతో కూడిన చిత్రపటాన్ని ఆయనకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో సాపా వీర రాఘవులు,సాపా వెంకట రామారావు,తంగిరాల హనుమంత రెడ్డి, సాపా ఆదినారాయణ, ఇమ్మడి సురేంద్ర,బోడపాటి హనుమంతు,వడ్లమూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆస్తి.అధికారంపై వ్యామోహం.. తల్లీ, చెల్లెళ్లపై విద్వేషం, ఇదే జగన్ పాలసీ : ప్రత్తిపాటి

## ప్రజా ప్రభుత్వంపై దుష్ప్రచారం.. పరంధామునితో రాజకీయ క్రీడలాడుతూ జగన్..వైసీపీనేతలు ఘోరపాపానికి పాల్పడుతున్నారు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 21: చిలకలూరిపేట : ఆస్తిపాస్తుల్ని..అధికారాన్ని ప్రేమించాలి. తండ్రి వారసత్వంగా ఇచ్చిన సొమ్ములో వాటాలడిగే తల్లిని, చెల్లిని ద్వేషించాలి. బాబాయ్ హత్యతో లబ్ధిపొందాలి.. ఆయన బిడ్డను మాత్రం సూటిపోటి మాటలతో వేధించాలి. అన్నదే జగన్ పాలసీ. ఈ ప్రాథమిక సిద్ధాంతాలకు కట్టుబడ్డ జగన్ ఐదేళ్లపాటు ప్రజలను, రాష్ట్రాన్ని తాను ఉద్ధరించినట్టు.. ఇప్పుడున్న ప్రజా ప్రభుత్వం అసలేమీ చేయనట్టు నమ్మబలకడం సిగ్గుచేటు. 95 శాతం ప్రజల మద్ధతుతో భారీ విజయంతో అధికారంలోకి వచ్చిన కూటమిప్రభుత్వాన్ని ఆడిపోసుకోవడమే జగన్ పనిగా పెట్టుకున్నాడు. చివరకు తన స్వార్థ, నీతిమాలిన రాజకీయాల కోసం కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరునితో రాజకీయాలు చేసే దుస్థితికి దిగజారాడు. జగన్... వైసీపీనేతలు తమ కుట్ర రాజకీయాలకోసం ఆ పరంధామునితో పరాచకాలాడటం తక్షణమే మానుకోవాలి. లేకుంటే కాలం వారికి విధించే శిక్ష ఊహాకు కూడా అందదు. ముఖ్యమంత్రి చంద్రబాబు సకుటుంబ సపరివారంతో స్వామి సేవలో తరిస్తూ.. భక్తుల యోగక్షేమాలు విచారిస్తుంటే... జగన్ తన క్రిమినల్



ముఠాతో, అవినీతి పరివారంతో వేంకటేశ్వరుని పవిత్రత.. తిరుమల ప్రతిష్ఠపై దుష్ప్రచారానికి తెగబడటం మహాపాతకమే అవుతుంది. కూటమి ప్రభుత్వ అభివృద్ధిని స్వాగతించకుండా... ప్రజలు మెచ్చే సంక్షేమాన్ని హర్షించకుండా, జన్మజన్మలకు సరిపోయేలా జగన్ .. వైసీపీనేతలు ఘోరపాపాలకు ఒడిగడుతున్నారు." అని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగ

భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 21: రంజాన్ పండుగ సందర్భంగా మండలం లోని పలు గ్రామాలలో ముస్లిం సోదరులు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు. నెల రోజులు కఠిన ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులు శుక్రవారం నెలవంక కనిపించడంతో దీక్షలను ముగించి శనివారం రంజాన్ పండుగను నిర్వహించారు. భట్టిప్రోలు మండలంలోని భట్టిప్రోలు,అద్దేపల్లి, ఐలవరం,పల్లెకోన, ఆళ్ళమూడి,వేమవరం,వెల్లటూరు గ్రామాలలోని ముస్లిం సోదరులు,పెద్దలు యువకులు ఉదయాన్నే మసీదుల వద్దకు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అందరూ కలిసి ప్రార్థనలను చేస్తూ పురవీధులలో ర్యాలీగా గ్రామాలకు దగ్గరలో నున్న ఈద్గాల వద్దకు వెళ్లారు.



ఈద్గాల వద్ద మత గురువుల పర్యవేక్షణలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనలు పూర్తయిన పిమ్మట దారి వెంట ఉన్న పేదలకు ముస్లిం సోదరులు దాన ధర్మాలు చేశారు.

# ఉన్నం మృతి టీడీపీకి తీరని లోటు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 21: చిలకలూరిపేట : తెలుగుదేశం సీనియర్ నాయకులు. కల్యాణ దుర్గం మాజీ శాసనసభ్యులు ఉన్నం హనుమంతరాయ చౌదరి మృతి వార్త తెలిసి తీవ్ర వేదనకు గురయ్యాను. ఆయన మరణం పార్టీకి, స్థానిక టీడీపీ శ్రేణులకు, అభిమానులకు తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను. హనుమంత రాయ చౌదరి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నాను. సర్పంచ్ గా మొదలైన ఆయన రాజకీయ జీవితం అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, పార్టీ రైతు విభాగం రాష్ట్ర




అధ్యక్షుడిగా., శాసనసభ్యుడిగా సుదీర్ఘకాలం కొనసాగడం పార్టీకి గర్వకారణం.. టీడీపీ బలోపేతానికి హనుమంతరాయ చౌదరి చేసిన కృషి అనన్య సామాన్యమైంది ." అని మాజీమంత్రి ప్రత్తిపాటిపుల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# నియోజకవర్గ ఐదు మండలాల లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్





అమరావతి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21: పెదకూరపాడు నియోజకవర్గంలోని అచ్చంపేట, క్రోసూరు, పెదకూరపాడు, బెల్లంకొండ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి సిఎంఆర్ఎఫ్ చెక్కులను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పంపిణీ చేశారు.నాలుగు మండలాలకు చెందిన మొత్తం 46 మంది లబ్ధిదారులకు రూ.29,08,965 విలువైన చెక్కులను నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం భారిన పడి కష్టకాలంలో చికిత్స పొందిన వారికి ఆర్థిక భరోసాగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు సహాయ నిధి నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి అర్హులైన వ్యక్తికి సహాయం అందుతుందని ఎమ్మెల్యే తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు.ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు.

# డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు: అర్బన్ ఎస్ఐ చెన్నకేశవులు



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 21: చిలకలూరిపేట : డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడవడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ ఎస్ఐ చెన్నకేశవులు హెచ్చరించారు. శనివారం చిలకలూరిపేట అడ్డరోడ్డు సెంటర్ వద్ద ఉన్నతాధికారి రమేష్ ఆదేశాల మేరకు, ఎస్ఐ హాజరత్తయ్యతో కలిసి ఆయన ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో భాగంగా వాహనాలు నడుపుతున్న పలువురు మైనర్ బాలురను గుర్తించిన పోలీసులు, వారికి మరియు వారి తల్లిదండ్రులకు రోడ్డు ప్రమాదాల తీవ్రతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రహదారి నిబంధనలను తూచా తప్పకుండా పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# అమరావతి -సత్తెనపల్లి రహదారిపై రంజాన్ ప్రార్థనల వెల్లువ!



అమరావతి పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21: అమరావతి మండల పరిధిలోని సత్తెనపల్లి రోడ్డులో రంజాన్ వేడుకలు అంబరాన్నంటాయి. మసీదు ప్రాంగణం భక్తులతో నిండిపోవడంతో, ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో ప్రధాన రహదారిపైనే కూర్చుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్ పవిత్ర రంజాన్ విశిష్టతను వివరించారు. రహదారిపైనే భక్తిభావంతో నమాజ్ చేస్తున్న దృశ్యం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. క్రమశిక్షణతో ప్రార్థనలు ముగించి ఒకరికొకరు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు.


# ఇంతియాజ్ సేవ స్ఫూర్తి ఆదర్శనీయం.





మంగళగిరి, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21: మంగళగిరి ఈద్గా వద్ద రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ స్ఫూర్తితో తెలుగు యువత నాయకులు షేక్ ఇంతియాజ్ ఆధ్వర్యంలో శనివారం ముస్లిం సోదరులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. ఈద్గా ఆవరణలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు అనంతరం ముస్లిం సోదరులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. సుమారు 2500 వాటర్ బాటిల్స్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ ఇబ్రహీం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు మాట్లాడారు. యువత నాయకులు ఇంతియాజ్ రంజాన్ పర్వదినాన ముస్లిం సోదరుల ప్రార్థనల అనంతరం వాటర్ బాటిల్స్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. తన వ్యాపారం చేసుకుంటూనే సమాజంలో పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న ఇంతియాజ్ సేవా స్ఫూర్తి పలువురికి ఆదర్శనీయం కావాలన్నారు. అల్లా దీవెనలు ఆయనకు ఎల్లప్పుడూ ఉండి, భవిష్యత్తులో మరిన్ని మంచి సేవా కార్యక్రమాలతో ముందుకు వెళ్లాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శివాలయం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు సుఖమంచి గిరిబాబు, టీడీపీ మైనార్టీ నాయకులు షేక్ హుస్సేన్, అబ్దుల్ మజీద్, కరీం, అమీర్, గల్ఫ్ సుభాని, షహేన్వా, టీడీపీ నాయకులు మల్లాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరి నియోజకవర్గ గ్యాస్ వినియోగదారులకు దుగ్గిరాల మండలం HP గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల ప్రతినిధి గద్దె శ్రీనివాస్ విన్నపం..




మంగళగిరి, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21: సోషల్ మీడియాలో గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల మీద మరియు గ్యాస్ డెలివరీ బాయ్స్ మీద వస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు ఎవరూ నమ్మవద్దు . గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు కానీ పనిచేసే బాయ్స్ కానీ ఎవరు కూడా వాణిజ్య అవసరాల కోసం గ్యాస్ ను విక్రయించడం లేదు, మరియు బ్లాక్ మార్కెట్లో గ్యాస్ సరఫరా చేయడం లేదు. మా వినియోగదారులకు ఏదైతే గ్యాస్ సరఫరా చేస్తున్నాము. ఆ గ్యాస్ కేవలం బుకింగ్ మరియు ఓటిపి ద్వారా మాత్రమే తీసుకోగలరు.. ఎవరికి కూడా అధికంగా డబ్బు చెల్లించవలసిన అవసరం లేదు.. గృహ అవసరాల నిమిత్తం సరఫరా చేస్తున్న డొమెస్టిక్ సిలిండర్లను డబ్బులకు ఆశపడి వాణిజ్య అవసరాల నిమిత్తం బయట ఎవరికి కూడా అమ్మవద్దు. ప్రస్తుతానికి అనేక చట్టాలు అమలులో ఉన్నాయి.. నిత్యవసరాల చట్టం కింద మీమీద యాక్షన్ తీసుకునే అవకాశం ఉంటుంది . అందువల్ల దయచేసి ఎవరూ కూడా డబ్బులకు ఆశపడి బయట హోటల్స్ కి గాని, వాణిజ్య అవసరాల కోసం కానీ గ్యాస్ ని ఇవ్వవద్దు . దయచేసి డిస్ట్రిబ్యూటర్లుతో మరియు గ్యాస్ డెలివరీ బాయ్స్ తో సహకరించగలరు.

# ఆగయా రంజాన్ - నెల రోజులు ఉపవాస దీక్ష ముగింపు.




మంగళగిరి, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21: ముస్లింలు అతి పవిత్రంగా భావించే రంజాన్ పండుగను శనివారం అత్యంత వైభవంగా జరుపుకోనున్నారు. ముస్లిం సోదర, సోదరీమణులు నెల రోజుల పాటు చేపట్టిన ఉపవాస దీక్షలను శుక్రవారం సాయంత్రం మగ్రిభ్ నమాజ్ ముందు విరమించారు. ఆకాశంలో శుక్రవారం రాత్రి నెలవంక కనిపించడంతో ముస్లిం మత పెద్దలు రంజాన్ పర్వదినాన్ని ప్రకటించారు. మనసుని దైవచింతనకు ప్రేరేపించే సందర్భం.. రోజా ఉపవాస దీక్షలు, ఆత్మీయతను అలింగనం చేసుకునే సత్సంప్రదాయమే రంజాన్‌గా చెప్పుకోవచ్చు. ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే రెండు పండుగలలో మొదటిది రంజాన్ (ఈద్–ఉల్–ఫితర్). ఇప్పటికే మసీదులు, నమాజ్ చేసే ఈద్గా మైదానాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వివిధ రకాల విద్యుత్ దీపాలతో మసీదులను శోభాయమానంగా అలంకరించారు.

అత్యంత నిష్ఠతో నెలరోజుల కఠోర ఉపవాస దీక్ష పూర్తిచేసుకున్న ప్రతి ముస్లిం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే పవిత్రమైన రంజాన్ పర్వదినం వచ్చేసింది. ఆకాశంలో శుక్రవారం రాత్రి నెలవంక కనిపించడంతో శనివారం ఇంటిల్లిపాది పండుగను సంతోషంగా జరుపుకొనేందుకు ప్రతి ముస్లిం కుటుంబం సిద్ధమైంది. ఈమేరకు సామూహిక నమాజ్ లు చేసేందుకు ఈద్గా మైదానాలు, మసీదులను ముస్తాబు చేసి అందంగా అలకరించారు. ఇక ఆత్మీయ ఆలింగనాలు, అత్తరు గుబాళింపుల నడుమ కీర్, సేమియాల తియ్యదనం.. హలీం ఘాటుదనం.. బిర్యానీ పలావుల ఘుమఘుమలను ఆస్వాదించి దానధర్మాలు చేయనున్నారు.

30 రోజుల పాటు నిర్వహించిన ఉపవాస దీక్షలు ఉపసంహారణే ఈద్–ఉల్–ఫితర్. అల్లాహ్ పెట్టిన కఠోర పరీక్షలను ఎదుర్కొని నియమాలను ఆచరిస్తూ నిండైన ఆత్మవిశ్వాసంతో అరవిరిసిన ఆనందంతో జరుపుకునేదే ఈద్–ఉల్–ఫితర్ పర్వదినంగా పెద్దలు చెబుతున్నారు. పండుగ పూట నమాజ్‌కు ముందు పేదలకు ఇచ్చే దానాన్నే ఫితర్ అంటారు. అందుకే ఈ పండుగకు ఈద్–ఉల్–ఫితర్ అనే పేరొచ్చింది. ముస్లింలు ఉపవాస కాలంలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్నిసార్లు తెలిసి.. తెలియకుండా ఏవేవో తప్పులు, పొరపాట్లు జరుగుతుంటాయి. వాటి పరిహారం కోసం చేసే దానమే ఫితర్. ఇలా దానం చేయడం వల్ల పేదలు కూడా కొత్త బట్టలు ధరించి, మంచి ఆహార పదార్థాలను తీసుకునే అవకాశం ఉంటుంది. అందుకే ఈ పండుగ పూట బియ్యం, గోధుమలను దానం చేస్తారు. పండుగ నాడు ఎంత పేద వారైనా కొత్త దుస్తులు ధరించి అత్తరు, సుర్మాలు రాసుకుని మసీదులు, ఈద్గాలలో జరిగే సామూహిక ప్రార్థనల్లో పాల్గొంటారు. అక్కడ మత పెద్దలు వినిపించే కుద్బాను భక్తిశ్రద్ధలతో విని భావి జీవితం సుఖసంతోషాలతో గడిచేలా చూడాలని అల్లాహ్ ను వేడుకొని నమాజ్ చేస్తారు. అనంతరం ఈద్ ముబారక్ అంటూ ఆత్మీయతతో ఆలింగనాలు చేసుకుంటారు. ఈ సందర్భాల్లోనే మాటలు మానుకున్న మిత్రులు సైతం ఒక్క ఆలింగనంతోనే దగ్గరైపోతారు.

జకాత్ అంటే దానధర్మాలు చేయడం. ఇస్లాం మతాన్ని ఆచరించే ప్రతి వ్యక్తి తన వార్షిక ఆదాయంలో 2.5శాతం దీనులకు, పేదలకు, ఆపదలో ఉన్న వాళ్లకు ఖర్చు చేయాలి. ఈ జకాత్‌ను గనుక రంజాన్ మాసంలో చేసినట్లయితే 70శాతం అధిక పుణ్యం లభిస్తుందన్నది ముస్లింల నమ్మకం. ఒకప్పుడు జకాత్ అనేది ఆహారం, దుస్తుల రూపంలో ఉన్నా ఇప్పుడు నగదును కూడా జకాత్ రూపంలో ఇస్తూ పేద వాళ్లను ఆదుకుంటున్నారు. జకాత్ ఇవ్వడానికి ధనవంతులే కానవసరం లేదు. చిల్లిగవ్వ చేతిలో లేకున్నా సాటి మనిషి చిరునవ్వులతో పలకరించినా జకాతే అవుతుంది. కుల, మత బేధం లేకుండా స్నేహితులను తమ ఇళ్లలోకి ఆహ్వానించి సేమియా పాయసం వడ్డించి, బిర్యానీ ఘుమఘుమల రుచిని చూపిస్తారు.

# “అన్నదాతల కన్నీరు తుడవడానికి ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది ”

## మెట్టుకూరు కృష్ణారెడ్డి టిడిపి మండల అధ్యక్షులు



నెల్లూరు (స్టాఫ్ రిపోర్టర్)నమస్తే పల్నాడు మార్చి21 ఇటీవల వచ్చిన అకాల వర్షాలు, వడగళ్ల వాన కారణంగా తీవ్రంగా నష్టపోయిన అనంతసాగరం మండలంలోని రైతులను పరామర్శించేందుకు, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వారికి భరోసా ఇచ్చేందుకు రాష్ట్ర దేవాదాయ మరియు ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఈ నెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు నెల్లూరు నుండి బయలుదేరి మండలంలోని గుడిగుంట, చిలకలమర్రి, మంగుపల్లి, కామిరెడ్డిపాడు గ్రామాలలో పర్యటించనున్నారని తెలుగుదేశం పార్టీ అనంతసాగరం మండల అధ్యక్షులు మెట్టుకూరు కృష్ణారెడ్డి తెలిపారు.ఈ పర్యటనలో భాగంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పంట నష్టం జరిగిన పొలాలను స్వయంగా పరిశీలించడంతో పాటు, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోనున్నారు. అనంతరం 12 గంటలకు అనంతసాగరం ఎంపిడివో కార్యాలయంలో సంబంధిత వ్యవసాయ, సాగునీటి శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకునే దిశగా నిర్ణయాలు తీసుకోనున్నారు. రైతు కష్టాన్ని తన కష్టంగా భావించే ఈ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలబడేందుకు కట్టుబడి ఉందని, ఈ పర్యటన ద్వారా రైతులకు భరోసా కలిగించడంతో పాటు, వారికి త్వరితగతిన సహాయం అందేలా చర్యలు వేగవంతం కానున్నాయి.రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది అనే నమ్మకంతో, ప్రతి రైతు కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మన మంత్రి మరోసారి నిరూపించనున్నారు.

# ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ చేసిన ఎమ్మెల్యే యరపతినేని




పిడుగురాళ్ల, : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21: పిడుగురాళ్ల పట్టణం లోని యరపతినేని నగర్ లోని ఈద్ గా లో గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు ముస్లిం సోదరులతో కలిసి ఆనందోత్సవాలతో ఈదుల్ ఫితర్ నమాజ్ చదివి రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. ఈ నమాజ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ, అస్సలాముఅలైకుమ్ ఆప్ సబ్ కు బహుత్ బహుత్ ఈద్ ముబారక్ అంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ “పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఎంతో నియమనిష్టలతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు తీసుకుని ఉపవాసాలు ఉండి ఉపవాస దీక్షలు ముగించి, ఈదుల్ ఫితర్ నమాజు చదువుకుంటున్న ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులందరూ అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో తులతూగాలని, అన్ని వృత్తులకు సంబంధించిన వారు చేతినిండా పని ఉండి అందరి కుటుంబాలు ఆనందంగా ఉండాలని ఆ “అల్లాహ్” ని వేడుకుంటూ, నేను ముస్లిం కుటుంబంలో పుట్టకపోయినా ముస్లిం సోదర సోదరీమణులకు సేవ చేసుకునే భాగ్యం కలిగినందుకు ఆనందపడుతున్నాను అన్నారు. ఆ అల్లా దయవల్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లాకు చెందిన శాసనసభ్యులకు ర్యాంకులు ఇస్తూ మొదటి ర్యాంకు నాకు వచ్చినందుకు, నియోజకవర్గంలో నాకు మద్దతు తెలుపుతున్న సామాజిక వర్గాల్లో ముస్లిం సోదరులు 70 శాతం నాకు మద్దతునిస్తున్నారని తెలపడం ఎంతో సంతోషం ఇచ్చిందని ముందు ముందు ముస్లిం సోదరులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఆ అల్లా దయవలన ముందు ముందు 90 శాతం ముస్లిం సోదర సోదరీమణులు నాకు మద్దతు తెలపాలని అల్లాను వేడుకుంటున్నాను. గత పాలకులు ఈద్గాలో ముస్లిం సోదరులకు సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి పార్టీల వంకతో ఇక్కడ ఎటువంటి ఏర్పాటు చేయకపోయినా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు ఈద్గాలలో మనమే ఏర్పాట్లు చేశాం అని ఎమ్మెల్యే యరపతినేని అన్నారు. మీ అందరి ఆశీస్సులతో ముస్లింల చిరకాల కోరిక అయినటువంటి హజ్ యాత్రకు నేను కూడా పాలు పంచుకోవాలనే ఉద్దేశ్యంతో భారతదేశంలోని ఏ ఎమ్మెల్యే చేయనంతగా హజ్ కు వెళ్లే సోదర సోదరీమణులకు తలా రూ.లక్ష రూపాయలు ఇచ్చి సుమారు 50 మందిని మక్కా యాత్రకు పంపించి ఆ పుణ్యంలో పాలుపంచుకున్నాను అని అన్నారు. మన గురజాల నియోజకవర్గంలో మనం పెట్టిన తర్వాతే మొన్న 2024 ఎన్నికల్లో కూటమి ఎజెండాలో ప్రకటించి హజ్ యాత్రకు లక్ష రూపాయలు ఇవ్వటం ఎంతో ఆనందంగా ఉంది. ఇకనుండి హజ్ కు వెళ్లే ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం నుండి లక్ష రూపాయలు, గురజాల నియోజవర్గ ముస్లిం సోదరులకు నా తరపున లక్ష రూపాయలు ఇచ్చి పంపించడం జరుగుతుంది.

# సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



విజయనగరం : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21: విజయనగరం నియోజకవర్గ పరిధిలో మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి శనివారం తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 50మందికి పైగా సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ వ్యక్తులైతే ఎన్టీఆర్ వైద్య సేవలు పొందని వారికి, వైద్య ఖర్చులు ఎక్కువగా అయిన వారికి సిఎం రిలీఫ్ ఫండ్ విడుదల చేస్తున్నామని తెలిపారు. రోగులకు, వారి కుటుంబ సభ్యులకు కూటమి ప్రభుత్వం చేదోడువాదోడుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా రవి, మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఆస్తుల లొల్లికి ఫుల్ స్టాప్... కామానా



విజయవాడ, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21 దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబంలో ఆస్తుల చిచ్చు మరోసారి బహిర్గతమైంది. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన సోదరి షర్మిల, తల్లి విజయమ్మలపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ లో వేసిన పిటిషన్‌కు కౌంటర్‌గా విజయమ్మ శుక్రవారం ఒక కీలక అఫిడవిట్‌ను దాఖలు చేశారు. " వైఎస్సార్ బ్రతికున్నంత వరకు ఆస్తుల పంపకం జరగలేదు.. ఉన్నవన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులే అని ఆమె ఈ అఫిడవిట్ ద్వారా స్పష్టం చేశారు. విజయమ్మ తన అఫిడవిట్‌లో జగన్ వాదనలను పూర్తిగా తప్పుపట్టారు. 2009లో వైఎస్సార్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులే . ఆస్తుల పంపకం ఎప్పుడూ అధికారికంగా జరగలేదన్నారు. తన మనవలు, మనవరాళ్లు నలుగురికి ఆస్తులను సమానంగా పంచాలన్నదే వైఎస్సార్ ఉద్దేశ్యం, ఆజ్ఞ అని ఆమె అఫిడవిట్‌లో పేర్కొన్నారు. సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు, ఎంఓయూ లో లేని బెంగళూరులోని యలహంక ఇల్లు కూడా షర్మిలదేనని, అది వైఎస్సార్ ఆజ్ఞ అని తెలిపారు. జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి అంటే షర్మిల పిల్లలకు అన్యాయం చేశాడని, ఇప్పటికైనా వారికి న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈ అఫిడవిట్‌ను వైఎస్ విజయమ్మ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ లో సమర్పించారు. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ షేర్ల బదిలీకి సంబంధించి జగన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఆమె ఈ వివరణ ఇచ్చారు. ఈ పత్రాన్ని నోటరీ చేయించి, అధికారికంగా ట్రిబ్యూనల్‌కు అందజేశారు.షర్మిల ఆస్తుల కోసం పాకులాడుతోందంటూ జరుగుతున్న ప్రచారాన్ని విజయమ్మ తీవ్రంగా ఖండించారు. షర్మిల వద్ద ఉన్న ఆస్తులు జగన్ ఇచ్చినవి కావు, అవి ఆమెకు రావాల్సిన వాటా మాత్రమే అని స్పష్టం చేశారు. అలాగే తనను బినామీగా చిత్రీకరించవద్దని, దేవుడి సాక్షిగా తాను చెబుతున్నవన్నీ వాస్తవాలేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అసత్య ప్రచారాలను మానుకోవాలని మీడియాను వేడుకున్నారు.గతంలో వైఎస్ జగన్, షర్మిల మధ్య జరిగిన ఎంఓయూ ప్రకారం కొన్ని ఆస్తులను బహుమతిగా ఇస్తానని జగన్ పేర్కొన్నారు. వైఎస్ ఫ్యామిలీ ఆస్తులపై ఇంటాబయటా పెద్ద రచ్చ జరుగుతోంది. పలువురు వైసీపీ నేతలు ఈ అంశంపై ప్రెస్ మీట్లు పెట్టి షర్మిలపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయమ్మ అఫిడవిట్ ద్వారా ఆస్తులపై వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఇందులో అనేక కీలక అంశాలను ప్రస్తావించారు. వైఎస్సార్ మరణించే వరకు ఉన్న ఆస్తులన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులే అని స్పష్టం చేశారు. ఆస్తుల పంపకం ఇప్పటివరకు అసలు జరగలేదని ఆమె కుండబద్దలు కొట్టారు. జగన్ ఎంవోయూరాసింది కూడా షర్మిల హక్కును గుర్తించేనని, అది ఏమాత్రం దానం కాదని ఆమె స్పష్టం చేశారు.వైసీపీ నేతలు మీడియాలో చేస్తున్న ప్రచారాన్ని విజయమ్మ గోబెల్స్ ప్రచారంగా అభివర్ణించారు. షర్మిలకు జగన్ వేల కోట్లు ఇచ్చారని ప్రచారం చేయడంపై ఆమె తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇప్పటి వరకు ఇచ్చిన డబ్బు ఆస్తి పంపకం కాదని, వ్యాపార లాభాల నుంచి ఇచ్చిన డివిడెండ్ మాత్రమేనని ఆమె క్లారిటీ ఇచ్చారు."నిజం ఏమిటో నా దేవుడికి, నా కొడుక్కి తెలుసు" అని అనడం ద్వారా విజయమ్మ ఒక తల్లిగా జగన్ మనస్సాక్షిని తట్టిలేపే ప్రయత్నం చేశారు. తన మేనల్లుడికి, మేనకోడలికి (షర్మిల పిల్లలకు) జగన్ అన్యాయం చేస్తున్నాడని ఆవేదన చెందారు. సరస్వతి సిమెంట్స్‌తో పాటు బెంగళూరులోని యలహంక ప్యాలెస్ కూడా షర్మిలదేనని ఆమె తేల్చి చెప్పారు.రాజకీయ ప్రయోజనాల కోసం తన కుటుంబాన్ని వాడుకోవద్దని ఆమె మీడియాను కోరారు. అసత్యాలు ప్రచారం చేస్తున్న వారెవరైనా సరే, దేవుడి న్యాయమే అంతిమమని ఆమె పేర్కొనడం ద్వారా నైతిక పైచేయి సాధించే ప్రయత్నం చేశారుఈ అఫిడవిట్ ద్వారా విజయమ్మ ఒక ముఖ్యమైన సాక్షిగా మారారు. రేపు కోర్టులో ఆస్తుల వివాదం నడిచినప్పుడు, వైఎస్సార్ బతికున్నప్పుడు ఉన్నవన్నీ కుటుంబ ఆస్తులేనని ఆమె చెప్పిన మాటలు జగన్‌కు ప్రతికూలంగా మారే అవకాశం ఉంది. షర్మిల ఒంటరిగా పోరాడుతుందనే భావన కలగకుండా, కుటుంబ పెద్దగా విజయమ్మ ఆమె పక్షాన నిలిచారు. వైఎస్సార్ ఆశయం ప్రకారం నలుగురు మనవలకు సమాన వాటా దక్కాలనే పాయింట్‌ను ఆమె బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు."దేవుని సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలే" అని ముగించడం ద్వారా విజయమ్మ ఈ వివాదానికి అత్యున్నత ప్రాధాన్యతను ఇచ్చారు. అధికార బలంతోనో, అబద్ధపు ప్రచారాలతోనో గెలవాలని చూసేవారికి ఆమె పరోక్షంగా చురకలు అంటించారు. వైఎస్ కుటుంబంలో ఆర్థిక చిచ్చు ఇప్పట్లో తగ్గేలా లేదు. వైయస్ కుటుంబ ఆస్తుల వివాదంలో తల్లి విజయమ్మ తాజాగా వేసిన అఫిడవిట్ ఏపీ రాజకీయాల్లో సంచలనంగా మారుతుంది. తన సొంత కుమారుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి.. తన మనవలైన షర్మిల పిల్లలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాడంటూ ఆమె నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ లో ఆఫిడవిట్ దాఖలు చేశారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి బతికున్నంతవరకు ఆస్తుల పంపకం జరగలేదని.. ఉన్నవన్నీ ఉమ్మడి కుటుంబ ఆస్తులేనని ఆమె తేల్చి చెప్పారు. తన నలుగురు మనవలు, మనవరాళ్లకు ఆస్తులను సమానంగా పంచాలన్నదే రాజశేఖర్ రెడ్డి ఆఖరి కోరికగా, ఆజ్ఞగా ఆమె గుర్తు చేశారు. కొంతకాలంగా వైఎస్ కుటుంబంలో ఆస్తి వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు ఇతర ఆస్తుల విషయంలో వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో విజయమ్మ తన కుమార్తె షర్మిలకు అండగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలోనే జగన్మోహన్ రెడ్డి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. తన తల్లి షేర్ ను చెల్లెలు షర్మిల దక్కించుకోవడంపై పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గత కొద్దిరోజులుగా వాదనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విజయమ్మ అఫీడవిట్ దాఖలు చేశారు. జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి దక్కాల్సిన వాటాలు ఇవ్వకుండా మోసం చేయడం పై విజయమ్మ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సరస్వతి సిమెంట్స్ షేర్లతో పాటు యలహంక ఇల్లు కూడా షర్మిల దేనని.. ఇది వైయస్సార్ స్వయంగా ఇచ్చిన ఆదేశమని ఆమె స్పష్టం చేశారు. కేవలం రాజకీయ కారణాలతో లేదా ఇతర విభేదాలతో తన చెల్లెలి పిల్లలకు రావాల్సిన ఆస్తులను జగన్ అడ్డుకోవడం ధర్మం కాదని ఆమె ఆ ప్రత్యేక న్యాయస్థానానికి పేర్కొన్నారు. షర్మిల అడుగుతోంది కేవలం తన పిల్లల భవిష్యత్తు కోసం ఆమెకు రావాల్సిన రాజ్యాంగబద్ధమైన వాటాయే తప్ప.. జగన్ ఇచ్చే బహుమతి కాదని కూడా తేల్చి చెప్పారు.జగన్ తన తల్లి మాటలను మన్నించి తన సోదరికి న్యాయం చేస్తారా? లేక ఈ వివాదం రాజకీయ రచ్చగా మారుతుందా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. అయితే, రాజకీయ కారణాలు, ఇతర విభేదాల వల్ల ఆ ఒప్పందాన్ని రద్దు చేస్తున్నట్లు జగన్ ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించగా, అది తన హక్కు అని షర్మిల వాదిస్తున్నారు. ఇప్పుడు విజయమ్మ నేరుగా రంగంలోకి దిగి షర్మిల వైపు నిలబడటంతో ఈ వివాదం కొత్త మలుపు తిరిగింది.

# ఏపి లో రాగల మూడురోజులపాటు వానలు



విజయవాడ : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21: ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఒకవైపు ఉపరితల ఆవర్తనం, మరోవైపు అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రాగల మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా తీర ప్రాంతాలు, రాయలసీమలో ఈదురు గాలులతో కూడిన జల్లులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద లేదా విద్యుత్ స్తంభాల దగ్గర ఉండకూడదని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. ఈదురుగాలుల వల్ల అరటి, మామిడి వంటి తోటల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలు పెరగనున్న నేపథ్యంలో వృద్ధులు, పిల్లలు మధ్యాహ్న సమయాల్లో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

ప్రస్తుతం మూడు రకాల వాతావరణ పరిస్థితులు రాష్ట్రంపై ప్రభావం చూపుతున్నాయి. దక్షిణ అంతర కర్నాటక పరిసరాల్లో సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తులో ఆవర్తనం కొనసాగుతోంది. గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుండి ఉత్తర అంతర కర్నాటక వరకు తమిళనాడు మీదుగా 0.9 కి.మీ ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఉత్తర కోస్తా ఆంధ్ర తీరంలో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం ప్రభావం ఈరోజు కొంత తగ్గింది.

ఉత్తర కోస్తా -- యానాం

ఇవాళ ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా గంటకు 40-60 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయి. ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉంది. రేపు, ఎల్లుండి వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ, ఈదురు గాలుల వేగం గంటకు 30-50 కి.మీ వరకు ఉంటుంది.


దక్షిణ కోస్తాంధ్ర ....

రాగల మూడు రోజులు ఇక్కడ వాతావరణం దాదాపు ఒకేలా ఉంటుంది. ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చు. గంటకు 30-50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయి.

రాయలసీమ

ఇవాళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. గంటకు 50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయి. రేపు తేలికపాటి వర్షాలు కురుస్తాయి. ఎల్లుండి కేవలం ఒకటి లేదా రెండు చోట్ల మాత్రమే తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది. కాగా రాష్ట్రంలో రాగల రెండు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండకపోయినప్పటికీ, ఆ తర్వాత 5 రోజుల్లో ఎండల తీవ్రత గణనీయంగా పెరగనుంది. వర్షాలు తగ్గగానే భానుడు తన ప్రతాపాన్ని చూపించనున్నాడు. క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# మంగళగిరి మోడల్ సాధ్యమేనా



గుంటూరు పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో యువనేత, మంత్రి నారా లోకేష్ తన పనితీరుతో ఒక కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. గత ఎన్నికల్లో మంగళగిరి నుంచి రికార్డు మెజారిటీతో విజయం సాధించిన తర్వాత, నియోజకవర్గ అభివృద్ధి , ప్రజా సంక్షేమం విషయంలో ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే, లోకేష్ సృష్టిస్తున్న ఈ స్టాండర్డ్ ను అందుకోవడంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలు మాత్రం వెనుకబడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నారా లోకేష్ మంగళగిరిలో కేవలం ఒక ఎమ్మెల్యేగా కాకుండా, ఒక వ్యవస్థగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. మంత్రిగా రాష్ట్రస్థాయి బాధ్యతల్లో అత్యంత బిజీగా ఉన్నప్పటికీ, తన నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అటు ఐటీ, విద్యాశాఖల మంత్రిగా సచివాలయంలో ఫైళ్లను క్లియర్ చేస్తూనే, ఇటు మంగళగిరిలోని పాఠశాలలకు ఆకస్మిక తనిఖీలకు వెళ్లడం, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయడం వంటి చర్యల ద్వారా గ్రౌండ్ లెవల్‌లో బలమైన ముద్ర వేస్తున్నారు. పర్యటనల్లో ప్రోటోకాల్ ఆడంబరాలు లేకుండా సామాన్యుడిలా ప్రజల మధ్యకు వెళ్లడం ఆయన పనితీరులోని ప్రత్యేకత.లోకేష్ తనను తాను ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుకుంటున్న తరుణంలో, టీడీపీలోని చాలామంది ఎమ్మెల్యేలు మాత్రం పాత ధోరణిలోనే సాగుతున్నారు. నియోజకవర్గాల అభివృద్ధి కంటే వ్యక్తిగత ఆధిపత్యం, స్థానిక వివాదాలు మరియు కాంట్రాక్టుల చుట్టూ కొందరు నేతలు తిరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. లోకేష్ తరహాలో టెక్నాలజీని వాడుకోవడం లేదా సోషల్ మీడియా ద్వారా ప్రజలతో నిరంతరం టచ్‌లో ఉండటం వంటి అంశాలను వీరు లైట్ తీసుకుంటున్నారు. ఫలితంగా, కొన్ని నియోజకవర్గాల్లో పార్టీ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా, ఎమ్మెల్యేలు వివాదాల్లో చిక్కుకుంటున్నారు.లోకేష్ పనితీరును అందరూ అనుసరించాలని టీడీపీ హైకమాండ్ బహిరంగంగా ఆదేశాలు ఇస్తున్నట్లు కనిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేలను మోటివేట్ చేయడంలో మాత్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదనే విశ్లేషణలు వస్తున్నాయి. బహుశా సీనియర్ ఎమ్మెల్యేల పనితీరును ఒక్కసారిగా మార్చడం సాధ్యం కాదన్న ఉద్దేశంతో అధిష్టానం ఉందేమో కానీ, లోకేష్ సాధిస్తున్న ఫలితాలను చూసైనా నేతలు మారాలన్న ఒత్తిడి క్యాడర్ నుంచి పెరుగుతోంది. లోకేష్ తన శాఖల్లో చూపిస్తున్న వేగాన్ని పార్టీ యంత్రాంగం మొత్తం అందిపుచ్చుకోలేకపోవడం ఒక లోపంగా కనిపిస్తోంది.రాజకీయాల్లో ఇప్పుడు వ్యక్తిగత ఇమేజ్ కంటే ప్రజాబలం ముఖ్యం. లోకేష్ తన ఇమేజ్‌ను మంగళగిరిలో చేసిన సేవా కార్యక్రమాల ద్వారా పెంచుకున్నారు. కానీ, చాలామంది ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో కేవలం ఎన్నికల సమయంలోనే కనిపిస్తారన్న ముద్రను చెరిపేసుకోలేకపోతున్నారు. లోకేష్ సెట్ చేసిన స్టాండర్డ్స్ ఒక రకంగా టీడీపీ నేతలకు సవాల్‌గా మారాయి. ఆయన వేగాన్ని తట్టుకుని నిలబడాలంటే, ఎమ్మెల్యేలు తమ పనితీరును సమూలంగా మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నారా లోకేష్ ఇప్పుడు 'నెక్స్ట్ జనరేషన్' లీడర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్నారు. కేవలం లోకేష్ ఒక్కరు కష్టపడితే సరిపోదని, పార్టీలోని ఎమ్మెల్యేలందరూ అదే స్థాయిలో కష్టపడితేనే 2029 ఎన్నికల నాటికి టీడీపీ మళ్ళీ తిరుగులేని శక్తిగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.మరిలోకేష్‌నుచూసి ఈ ఎమ్మెల్యేలు ఎప్పుడు చక్కబడతారో వేచి చూడాలి.

# రాష్ట్రంలో మళ్లీ కిరోసిన్ సరఫరా ..!



అమరావతి : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21: కేంద్రం కిరోసిన్ కూడా అందించాలని ప్రకటించిందని, త్వరలోనే కిరోసిన్ సరఫరా చేస్తామని మంత్రి నాదెండ్ల తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా గృహ అవసరాలకు సంబంధించిన వంట గ్యాస్ కొరత లేదని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. ప్రజల్లో అపోహలు, భయాందోళనలు కలిగించే వారిపై అప్రమత్తంగా ఉండాలని సంబంధిత శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రజలకు సూచించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరాను మూడు ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హెచ్పీసీఎల్ వంటి ప్రధాన ఆయిల్ కంపెనీలు సప్లయి చేస్తున్నాయన్నారు. సోషల్ మీడియాలో కొందరు కావాలని గ్యాస్ సరఫరా విషయంలో ప్రజల్లో భయాందోళనలు కలిగించేలా మాట్లాడుతున్నారు. దీనివల్ల ప్రజలు ఆందోళనకు గురై ఎక్కువ బుకింగ్స్ జరుపుతున్నారని మంత్రి నాదెండ్ల తెలిపారు.

గ్యాస్ కొరతా లేదు....

గత వారం రోజుల్లో ఇలాంటి అపోహల వల్లనే అధికంగా బుకింగ్స్ జరిగాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని... ముఖ్యంగా గృహ అవసరాలకు ఏ మాత్రం ఇబ్బందులు లేకుండా సాఫీగా గ్యాస్ సరఫరా చేస్తున్నామన్నారు. వాణిజ్య అవసరాలకు కూడా ప్రస్తుతానికి పెద్ద ఇబ్బందులేవీ లేవన్నారు. ఆస్పత్రులు, పాఠశాలలు, వసతి గృహాలు, అత్యవసర సర్వీసులకు మొదటి ప్రాధాన్యం ఇస్తూ వాణిజ్య అవసరాల గ్యాస్ ను సరఫరా చేస్తున్నామన్నారు. క్రమంగా గ్యాస్ సరఫరా మరింత మెరుగయ్యేలా ప్రణాళికాబద్ధంగా సమష్టిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న గ్యాస్ పరిస్థితులను చూస్తూ రాష్ట్రంలో గ్యాస్ ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సమీక్షలు జరపడమేకాకుండా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా వెతుకుతుందన్నారు. ఈ నెల 9న ఎసెన్షియల్ కమర్షియల్ యాక్ట్ ను కేంద్రం ప్రకటించిన దగ్గర నుంచి.... రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్త పడుతుందన్నారు.

ఓటీపీ ద్వారానే బుకింగ్స్ -- మంత్రి నాదెండ్ల

పౌర సరఫరాలు శాఖ ఆధ్వర్యంలో అన్ని వివరాలు తెప్పించుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో గతంలో రోజుకు 1 లక్ష 80 వేల వరకు... రద్దీ సమయాల్లో ఎక్కువగా దాదాపు 1,96,000 వరకు గ్యాస్ బుకింగ్స్ జరిగాయన్నారు. పట్టణ ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ల నుంచి పైప్డ్ నేచురల్ గ్యాస్ (గ్రాచీ+) కి మారేలా కొత్త పాలసీని సోమవారం సాయంత్రానికి సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. హోటల్స్ తో, రెస్టారెంట్ ప్రతినిధులతో త్వరలో సమావేశం పెడుతున్నామన్నారు. ముందుగా పాఠశాలల్లోని హాస్టల్స్, హాస్పిటల్స్ లో గ్యాస్ అందిస్తున్నామని తెలిపారు. ఆ తరువాత తదితర రంగాలకు వాటి ప్రాధాన్యత ఆధారంగా ఇవ్వబోతున్నామని వివరించారు. ఆన్లైన్ ద్వారానే బుకింగ్స్ చేసుకోవాలి అని.... ఓటీపీ ద్వారా 100 శాతం గ్యాస్ అందేలా చేస్తున్నామన్నారు. ఓటీపీ వస్తేనే బుక్ అయినట్లు గా నిర్ధారణ చెందుతుందన్నారు.

బ్లాక్ మార్కెట్ పై మీడియా లో వచ్చిన కథనాల ప్రకారం .... ఉక్కుపాదం మోపుతామన్నారు. "గ్యాస్ ఏజెన్సీలన్నింటికి విజ్ఞప్తి చేస్తున్నాం, ప్రతి ఒక్కరి లిస్ట్ మా దగ్గర ఉన్నాయి. ఎక్కడైనా గ్యాస్ పక్కదారి పడితే చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని హెచ్చరిస్తున్నాం. ఇప్పటికే అలాంటి చర్యలకు పాల్పడిన 6 నుంచి 9 ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటున్నాం" అని మంత్రి నాదెండ్ల స్పష్టం చేశారు.

త్వరలోనే కిరోసిన్ సరఫరా -- మంత్రి నాదెండ్ల

కేంద్రం కిరోసిన్ కూడా అందించాలని ప్రకటించిందని మంత్రి నాదెండ్ల తెలిపారు. త్వరలోనే కిరోసిన్ సరఫరా చేస్తామన్నామన్నారు. ఏపీని గతంలోనే కిరోసిన్ రహితంగా చేశామని... కానీ పరిస్థితుల దఅష్ట్యా వాడకం మళ్లీ మొదలు పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ముందుగా ఏజెన్సీ, గ్రామీణ ప్రాంతాల్లో ఇవ్వబోతున్నామన్నారు. జిల్లా స్థాయిలోనూ జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని గ్యాస్ సరఫరా వాస్తవ పరిస్థితిని అందిస్తున్నారని వివరించారు.

# వార్నింగ్ లతో సరి...



విజయవాడ, పెన్ పవర్ ప్రతినిధి మార్చి 21: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో టీడీపీ వ్యవహార శైలి పై ఇటీవల చర్చలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా పార్టీ నేతల ప్రవర్తనపై ఆరోపణలు వస్తున్నప్పటికీ, వాటిపై కఠిన చర్యలు తీసుకోవడంలో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మృదువైన వైఖరిని అవలంబిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాయకులు దారి తప్పుతున్నారని సమీక్షలు నిర్వహించడం, వారిని హెచ్చరించడం వరకే పరిమితమవుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇటీవల ఏలూరు ( ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ వ్యవహారం ఈ చర్చకు మరింత బలం చేకూర్చింది. ఇప్పటికే 2024లో డ్రగ్స్ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న ఆయనపై మరోసారి అదే విధమైన ఆరోపణలు రావడం పార్టీకి ఇబ్బందికర పరిస్థితిని తీసుకొచ్చింది. గతంలో కూడా ఈ విషయంపై సీరియస్‌గా స్పందించినట్టు ప్రకటించినప్పటికీ, వాస్తవానికి కఠిన చర్యలు తీసుకోకపోవడం ఇప్పుడు విమర్శలకు దారితీస్తోంది.చంద్రబాబు పాలనలో విజన్, అభివృద్ధి, పారదర్శకత వంటి అంశాలు ప్రాధాన్యం పొందుతున్నప్పటికీ, పార్టీ అంతర్గత వ్యవహారాల్లో మాత్రం క్రమశిక్షణ లోపిస్తున్నదన్న అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యంగా ఎమ్మెల్యేలు ఎంపీలు మధ్య విభేదాలు బయటపడటం, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయి. క్షేత్రస్థాయిలో కూడా నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం కార్యకర్తల్లో అసంతృప్తిని పెంచుతోంది.ఈ పరిస్థితుల్లో కనీసం ఒక నాయకుడిపై అయినా కఠిన చర్యలు తీసుకుని ఉదాహరణ చూపించాల్సిన అవసరం ఉందని పార్టీ సీనియర్లు భావిస్తున్నారు. కానీ ప్రతి సారి "హెచ్చరించాం" అనే ప్రకటనలతో సరిపెట్టుకోవడం సమస్యను మరింత పెంచుతోందని అంటున్నారు. ఈ విధానం వల్ల నాయకులు తమ ప్రవర్తనను మార్చుకోవాలనే ఒత్తిడి అనుభవించడంలేదని కూడా అభిప్రాయపడుతున్నారు.ఇదే సమయంలో ప్రతిపక్షం వైసీపీ పై దాడి చేయాల్సిన పరిస్థితుల్లో, తమ పార్టీ లోపాలే ముందుకు రావడం టీడీపీకి ఇబ్బందిగా మారుతోంది. ఒకవైపు ప్రభుత్వ పనితీరు గురించి చెప్పుకోవాల్సిన సమయంలో, మరోవైపు నాయకుల వివాదాలు చర్చకు రావడం వల్ల పార్టీ ఇమేజ్‌పై ప్రభావం పడుతోంది.సీనియర్ నాయకులు సూచిస్తున్నది ఏమిటంటే, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై స్పష్టమైన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే క్రమశిక్షణను పునరుద్ధరించవచ్చని. సంఘటనలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, ముందుగానే నియంత్రణ చర్యలు తీసుకోవాలని వారు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి చూస్తే, టీడీపీకి ప్రస్తుతం ఉన్న సవాలు కేవలం రాజకీయ ప్రత్యర్థులతో మాత్రమే కాదు, పార్టీ అంతర్గత వ్యవహారాలను సరిచేసుకోవడంలో కూడా ఉంది. ఈ పరిస్థితుల్లో నాయకత్వం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో పార్టీ దిశను నిర్ణయించే అవకాశముంది.